వానమ్మా.. నీ జాడెక్కడ?

- జూన్ గడిచినా కానరాని వర్షాలు
- తొలకరి వర్షాలకు దుక్కులు దున్ని సాగుకు సిద్ధం
- జిల్లా వ్యాప్తంగా 3.73 లక్షల ఎకరాల్లో సాగు అంచనా

వర్షం కోసం ఎదురుచూస్తున్న రైతు

వానమ్మ వానమ్మ వానమ్మ.. ఒక్కసారైన వచ్చిపోవే వానమ్మ.. చెరువుల్లో నీళ్లు లేవు, చెల్కల్లో నీళ్లు లేవు.. అంటూ ఓ కవి రాసినట్లు వాన రాక కోసం రైతులు కోటి కండ్లతో ఎదురుచూస్తున్నారు. నెల మొదట్లో కురిసిన ఒకటీ రెండు వర్షాలకు అన్నదాతలు భూములు దున్ని, సాగుకు సిద్ధం చేసుకున్నారు. అక్కడక్కడ విత్తనాలు విత్తుకున్నారు. నారుమళ్లు వేసుకుని చినుకు కోసం చింత చెందుతున్నారు. వరణుడు కరుణిస్తాడని ఆశగా ఎదురుచూస్తున్నారు.

మెదక్, (నమస్తే తెలంగాణ)/ రామాయంపేట, జూన్ 30: వానకాలంలో ఆశించిన స్థాయిలో వర్షాలు కురవక అన్నదాతలు ఆందోళనకు గురవుతున్నారు. జూన్‌లో వర్షాలు కురిసి పంట విత్తుకునే రైతులకు వర్షాభావంతో నిరాశే ఎదురవుతున్నది. జిల్లాలో మొక్కజొన్న, పత్తి తదితర పంటకు విత్తనాలు వేసేందుకు దుక్కులు దున్ని భూముల్ని సిద్ధం చేశారు. కొంతమంది రైతులు తమ బోరుబావుల వద్ద తుకాలు పోసి నాట్లకోసం పొలాలు తయారు చేశారు. ఎప్పుడు వానకురిస్తే అప్పుడే నాట్లు వేయవచ్చని భావిస్తున్నారు. పదేండ్ల కాలంలో ఎప్పుడూ ఇంత ఇబ్బందులకు గురికాని రైతులు ప్రస్తుతం వర్షం కోసం ఎదురు చూస్తున్నారు.

ఆశించిన స్థాయిలో వానల్లేక..

గతేడాది జూన్‌లో మోస్తరు వర్షాలు పడ్డాయి. ఆరంభంలోనే వరుణుడు కొంత కరుణించడంతో రైతులు ఉత్సాహంగా వానకాలం సాగు చేపట్టారు. ఈ ఏడాది వరుణుడి జాడే కనిపించడం లేదు. జూన్ గడిచిపోయినా నైరుతి రుతుపవనాల ప్రభావం ఎక్కడా కానరావడం లేదు. కారుమబ్బులే తప్ప చినుకు జాడ లేదు. ప్రస్తుతం జిల్లాలో విభిన్న వాతావరణం నెలకొన్నది. వ్యవసాయానికి అవసరమైన వర్షాలు కురవకపోవడంతో రైతులు ఆందోళనలో ఉన్నారు. కారుమబ్బులు పడుతున్నా గాలి దుమారంతో కూడిన చిరుజల్లులే తప్ప ఇప్పటి వరకు భారీ వర్షం నమోదైన దాఖలాలు లేవు. జూన్ తొలివారంలోనే వర్షాలు ప్రారంభమై, ఆడపాదడపా కురిసిన వర్షంతో రెండో వారం నాటికి వాతావరణం పూర్తిగా చల్లబడింది. ఆ తర్వాత భారీ వర్షం కురియలేదు. దీంతో రైతులు మొగులుకు మొఖం పెట్టి ఎదురుచూస్తున్నారు.

చేగుంట మండలంలో విత్తనాలు పత్తి, మొక్కజొన్న వేసినా మొలవని దుక్కులు

జిల్లాలో 3.73 లక్షల ఎకరాల్లో సాగు అంచనా..

జిల్లాలో ఈ వానకాలం సీజన్‌లో 3.73 లక్షల ఎకరాల్లో వివిధ పంటలు సాగవుతాయని అధికారులు అంచనా వేశారు. ఇందులో వరి 3.27 లక్షలు, పత్తి 40,619 ఎకరాలు సాగయ్యే అవకాశం ఉంది. సవ్యద్ధిగా వర్షాలు కురిస్తే జిల్లాలో పత్తి సాగు చేసేవారు. జూన్‌లో కురిసిన వర్షాలకు 10 వేల ఎకరాల్లో పత్తి, 150 ఎకరాల్లో మొక్కజొన్న, వంద ఎకరాల్లో పెసర సాగు చేసినట్టు వ్యవసాయ శాఖ అధికారులు చెబుతున్నారు. జిల్లాలో ప్రధాన పంట వరి వేయడానికి రైతులు నారుమళ్లు పోసి దుక్కులు సిద్ధం చేసి ఉంచారు. వర్షం కోసం ఎదురు చూస్తున్నారు. ఇప్పటికే రోహిణి, మిర్గం కార్తెలు దాటిపోయి ఇప్పుడు ఆరుద్ర కార్తె కొనసాగుతుంది. చినుకు జాడ కానరావడం లేదు. జూలై మొదటి వారంలో భారీ వర్షాలు కురిస్తే వరి నాట్లు వేసే అవకాశం ఉంటుంది.

ఆందోళన చెందవద్దు

మేలో కురిసిన వర్షాలకు రైతులు జిల్లాలో తమ పంటపొలాల్లో దాదాపు 24వేల ఎకరాల వరకు పంటలు వేసుకున్నారు. మిగతా రైతులు కూడా జూలైలో పంటలు విత్తుకోవచ్చు.ప్రస్తుతం రైతులకు ఆశించిన స్థాయిలో వానలు లేవు. వర్షాలు పడడంలేదని రైతులు ఆందోళన చెందవద్దు. జూలైలో చాలా వర్షాలు కురిసే అవకాశం ఉంది. రైతులందరూ దుక్కులు దున్ని తమ పొలాలను నాట్లకు సిద్ధం చేసుకోవాలి. రైతులకు కావాల్సిన ఎరువులు, విత్తనాలు వ్యవసాయ శాఖ, పీఏసీఎస్, అన్నదాత, పలు ఫర్టిలైజర్ దుకాణాల్లో అందుబాటులోనే ఉన్నాయి.

- గోవిందు, జిల్లా వ్యవసాయశాఖ అధికారి, మెదక్

పంటలపై అవగాహన కల్పిస్తున్నాం

రామాయంపేట మండల వ్యాప్తంగా రైతులకు పంటలపై అవగాహన శిబిరాలు ఏర్పాటు చేసి పలు సూచనలు చేస్తున్నాం. రైతులు తమకు కావాల్సిన ఎరువులు, విత్తనాలు అన్ని సిద్ధంగా ఉంచుకోవాలి. జూలైలో వర్షాలు కురుస్తాయి. రైతులు తమ పంట భూముల్లో పుష్కలంగా విత్తుకోవచ్చు.

- రాజ్‌నారాయణ, ఏవో, రామాయంపేట

వానల కోసం ఎదురుచూస్తున్నాం

వర్షాలు పడక చేలల్లో ఇప్పటివరకు పంటలు వేయలేదు. వానలు పడితే విత్తనాలు వేసుకునేందుకు భూములను దుక్కులు దున్ని సిద్ధం చేశాం. వానదేవుడు కరుణిస్తే పంటలు వేసేందుకు సిద్ధంగా ఉన్నాం. వేసిన పత్తి, మొక్కజొన్న విత్తనాలు మొలకెత్తల్లేవు. వర్షాల పడితే పంటలు విత్తుకోవడం లేకుంటే లేదు.

- చింతాకుల కొమురయ్య, రైతు, కర్నాల్‌పల్లి

ఆంక్షలు లేకుండా రైతు భరోసా ఇవ్వాలి

రామాయంపేటలో సహకార శాఖ కార్యాలయంలో రైతులతో సమావేశంలో డీసీవో కరుణ

అల్లాదుర్గం: రైతు భరోసా అభిప్రాయ సేకరణలో మాట్లాడుతున్న జిల్లా వ్యవసాయాధికారి గోవింద్

కొల్చారం: రైతు భరోసాపై అభిప్రాయ సేకరణ కార్యక్రమంలో పాల్గొన్న రైతులు

రామాయంపేట, జూన్ 30: రైతు భరోసాపై రైతులు సలహాలు ఇవ్వాలని జిల్లా సహకార శాఖ అధికారి కరుణ పేర్కొన్నారు. ఆదివారం రామాయంపేటలోని సహకార సంఘం కార్యాలయంలో రైతులతో సమావేశం ఏర్పాటు చేశారు. ప్రతి రైతుకు ప్రభుత్వ రుణ మాఫీ అందుతుందని డీసీవో తెలిపారు. రైతులు సమావేశంలో మాట్లాడుతూ ప్రభుత్వం రైతులకు అందించే రుణ మాఫీని ఏకకాలంలో చేయాలన్నారు. రైతు భరోసాను ఎలాంటి ఆంక్షలు లేకుండా ఇవ్వాలన్నారు. 10 ఎకరాలున్న రైతులకు రైతు భరోసా ఇవ్వాలన్నారు. అర్హులైన రైతులు వ్యవసాయం చేసేవారికే రైతు భరోసా అందించాలన్నారు. సమావేశంలో రామాయంపేట పీఏసీఎస్ చైర్మన్ బాదె చంద్రం, వ్యసాయశాఖ అధికారి రాజ్‌నారాయణ, సీఈవో పుట్టి నర్సింహులు తదితరులు ఉన్నారు.

రైతు భరోసాలో జాప్యం వద్దు

కొల్చారం, జూన్ 30: పట్టాతో పాటు అసైన్‌మెంట్ భూములకూ రైతు భరోసా, పంట రుణాలు ఇవ్వాలని మెదక్ మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్ కరెంట్ రాజాగౌడ్ అన్నారు. కొల్చారం, కిష్టాపూర్ సొసైటీల ఆధ్వర్యంలో రైతు భరోసాపై అభిప్రాయ సేకరణ నిర్వహించారు. సాగు చేసే ప్రతి గుంటకూ రైతు భరోసా ఇవ్వాలని పలువురు కోరారు. ఎరువులు, విత్తనాలు కొని, నాట్లు వేయడానికి సిద్ధపడుతున్న రైతులకు రైతు భరోసాలో జాప్యం తగదని రాజాగౌడ్ అన్నారు. సమావేశంలో సొసైటీల అధ్యక్షులు మనోహర్, మల్లేశంగౌడ్, సీఈవో కృష పాల్గొన్నారు.

కౌలు రైతులకూ ఇవ్వాలి

అల్లాదుర్గం, జూన్30: కౌలు రైతులకూ రైతు భరోసా ఇచ్చి ఆదుకోవాలని రైతులు కోరారు. అల్లాదుర్గం సొసైటీ పరిధిలోని రైతులతో రైతు భరోసా పథకంపై అభిప్రాయ సేకరణ నిర్వహించారు. జిల్లా వ్యవసాయాధికారి గోవింద్ అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో రైతుల నుంచి అభిప్రాయాలు సేకరించారు. 10 ఎకరాల వరకు పరిమితి విధించి పెట్టుబడి సాయం అందించాలన్నారు. కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ దుర్గారెడ్డి, ఏవో రాజేశ్, సీఈవో శివగౌడ్ పాల్గొన్నారు.

బాధిత కుటుంబ సభ్యులకు ఎమ్మెల్యే పరామర్శ

నర్సాపూర్, జూన్ 30: మండలంలోని జక్కపల్లి గ్రామానికి చెందిన బీఆర్ఎస్ పార్టీ కార్యకర్త కొనింటి మహేశ్‌గౌడ్ రెండు రోజుల క్రితం రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. ఆదివారం ఈ విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి జక్కపల్లి గ్రామంలోని మృతుడు మహేశ్‌గౌడ్ ఇంటికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించారు. మహేశ్‌గౌడ్ కుటుంబ సభ్యులకు అండగా ఉంటామని వారికి ధైర్యం చెప్పారు. ఎమ్మెల్యే వెంట బీఆర్ఎస్ పార్టీ నాయకులు ఉన్నారు.

బాధిత కుటుంబాలకు ఆర్థిక సాయం

చేగుంటలో బియ్యం, ఆర్థిక సాయం అందజేస్తున్న నాయకులు

చేగుంట, జూన్ 30: మండలంలోని పెద్ద శివునూర్ గ్రామానికి చెందిన మాదారం సత్తమ్మ ఇటీవల మృతి చెందింది. దుబ్బాక నియోజక వర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జీ చెరుకు శ్రీనివాస్‌రెడ్డి సూచనల మేరకు బాధిత కుటుంబానికి కాంగ్రెస్ నాయకులు శ్రీకాంత్, పార్టీ మండల అధ్యక్షుడు వడ్ల నవీన్‌కుమార్ 50 కిలోల బియ్యం, నగదును అందజేశారు. వారితో అన్నం ఆంజనేయులు, మద్దురి రాజు, అప్పల శ్రీనివాస్, ఎర్ర పోచారం, మాదారం ఎల్లం, రాజు, మహేశ్, శ్రీనివాస్ తదితరులున్నారు.

రామాయంపేటలో

రామాయంపేట, జూన్ 30: పట్టణంలోని మ్యాతరి లింగం ఆనారోగ్యంతో మృత్యువాత పడ్డాడు. విషయం తెలుసుకున్న పుట్టి సందీప్ రూ.5 వేల నగదును ఆదివారం అందజేశాడు.

రామాయంపేటలో ఆర్థిక సాయం అందజేస్తున్న సందీప్

గిజిగాడి డూప్లెక్స్ గూడు

మాకాడ గిజిగాడు డూప్లెక్స్ గూడు కట్టుకున్నాడు.. అది కూడా చూపరులను అబ్బురపరిచే ఉల్టా కట్టిండు.. ఎవరో చెప్పినట్లు, ఇంజినీరింగ్‌లో ఎక్కడో శిక్షణ పొందినట్లు, 'డూప్లెక్స్' తరహాలో ఒక గూడు నుంచి మరో గూడు జాలువారుతున్నట్లుగా అల్లుకున్నాడు.. పక్షులు, పాములు, ఇతర శత్రువుల బారి నుంచి తన గుడ్లను, పిల్లలను రక్షించుకోవడానికి పక్కాగా కట్టుకున్నడు. ఇలాంటి పిచ్చుక గూళ్లు మనోహరాబాద్ మండలం కూచారం గ్రామ నడిబొడ్డునున్న ఖాళీ స్థలంలోని ఓ చీమ చింతకాయ చెట్టుకు కనిపించగా 'నమస్తే తెలంగాణ' ఆదివారం క్లిక్ మనిపించింది!

- మనోహరాబాద్, జూన్ 30

చూడనిది చూసినట్టు.. అంతా కనికట్టు

కర్నాల్‌పల్లిలో సాధనసూరుల ప్రదర్శన

కర్నాల్‌పల్లిలో సాధనసూరుల ప్రదర్శన

చేగుంట, జూన్ 30: చూసింది చూసినట్టు చూడనది కనికట్టుగా సాధనసూరల ప్రదర్శన నిర్వహించారు. చేగుంట మండలం కర్నాల్‌పల్లి పద్మశాలి సంఘం ఆధ్వర్యంలో ఆదివారం గ్రామంలోని చావిడి వద్ద పలు కనికట్టు విద్యలను వారు ప్రదర్శించారు. కనికట్టు విద్యను ప్రదర్శించారు. రాళ్లనే దేవతా విగ్రహాలుగా చూపించారు. నెత్తిపై మంట పెట్టుకుని వంట చేశారు. చిన్న చిన్న కట్టె పుల్లలతో చేసి కావడిలో కూర్చున్నారు. తాళ్లతో తమను బంధీలుగా కట్టుకుని, కనికట్టు విద్య ప్రదర్శించి, వాటిని విడిపించుకోవడం వంటి పలు ప్రదర్శనలు చేసి, గ్రామస్తుల మన్ననలు పొందారు. కార్యక్రమంలో పద్మశాలి సంఘం అధ్యక్షుడు తుమ్మ యాదగిరి, నర్సింహులు, నరేశ్, అంబటి శ్రీనివాస్, సురేశ్, శ్రీకాంత్, రవి, తుమ్మ శ్రీనివాస్, నాగరాజు, గ్రామస్తులు పాల్గొన్నారు.

అనధికార రేషనలైజేషన్‌ను ఆపాలి: టీపీటీఎఫ్

మాట్లాడుతున్న అధ్యక్ష, కార్యదర్శులు

మెదక్, జూన్ 30 (నమస్తే తెలంగాణ)/ మెదక్ మున్సిపాలిటీ: రాష్ట్ర ప్రభుత్వం అనధికారిక రేషనలైజేషన్‌ను ఆపాలని టీపీటీఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సంగయ్య, వెంకట్‌ట్రాంరెడ్డి డిమాండ్ చేశారు. ఆదివారం మెదక్‌లోని జిల్లా కార్యాలయంలో విలేకర్లతో మాట్లాడారు. ఏ ప్రభుత్వ పాఠశాల మూతబడనీయమని, మూసేసిన వాటినీ తెరిపిస్తామని సీఎం చేసిన ప్రకటనకు భిన్నంగా విద్యా శాఖాధికారులు వ్యవరిస్తున్నారని ఆరోపించారు. ఎస్జీటీ బదిలీల్లో విద్యార్థుల సంఖ్య తక్కువగా ఉందనే కారణంతో చాలా పాఠశాలల్లో ఖాళీలు చూపించడంలేదన్నారు. ప్రభుత్వం దొంగచాటుగా రేషనలైజేషన్ ప్రక్రియకు పాల్పడుతున్నదని ఆరోపించారు. బదిలీల వెబ్ ఆప్షన్ ప్రక్రియను పొడిగించాలని డిమాండ్ చేశారు.

ఆత్మరక్షణకు కరాటే దోహదం

కరాటే పోటీల్లో మూడు మండలాల విద్యార్థులు

రామాయంపేట, జూన్ 30: విద్యార్థులు, మహిళల ఆత్మరక్షణకు కరాటే ఎంతో దోహదపడుతుందని కరాటే గ్రాండ్ మాస్టర్ రొయ్యల హరికుమార్ అన్నారు. ఆదివారం నిజాంపేట, నార్సింగి, రామాయంపేట మండలాలకు చెందిన ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు కరాటే పోటీలు నిర్వహించారు. కరాటేతో మానసిక ఉల్లాసంతో పాటు ఆరోగ్యంగా ఉంటామన్నారు. మొదటి రోజు కరాటే శిక్షణకు మూడు మండలాల నుంచి 80 మంది విద్యార్థులు హాజరైనట్లు తెలిపారు.

పోలీసులమని నమ్మించి.. బంగారం చోరీ

నర్సాపూర్, జూన్ 30: పట్టపగలు, నడిరోడ్డుపై, ఓ వైపు జనాలు సంచరిస్తుండగానే ఓ వ్యక్తి ఒంటిపై నుంచి బంగారం ఎత్తుకెళ్లిన ఘటన నర్సాపూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఆదివారం జరిగింది. ఎస్సై పుష్పరాజ్ తెలిపిన వివరాల ప్రకారం.. సిద్దిపేట జిల్లా నంగునూరు మండలం పాలమాకుల గ్రామానికి చెందిన జలమంచి చిత్తం శర్మ, నర్సాపూర్‌లోని బంధువుల ఇంటికి ఓ కార్యానికని, నర్సాపూర్ బస్‌స్టాప్‌లో బస్సు దిగి నడుచుకుంటూ వెళ్తున్నాడు. బస్టాండ్ ఎదుట ప్రధాన రహదారిపై ఇద్దరు గుర్తుతెలియని వ్యక్తులు అడ్డుపడ్డారు. తాము పోలీసులమని సదరు వ్యక్తికి బెదిరించారు. ఒకరు గట్టిగా పట్టుకోగా మరో వ్యక్తి బాధితుడి మెడలోని రుద్రాక్షకు గల బంగారం, ఉంగరాన్ని తీసుకుని పారిపోయారు. ఇది తులంన్నర బంగారం ఉంటుందని బాధితుడు వాపోయాడు. తూప్రాన్ పోలీస్‌స్టేషన్ పరిధిలో గతంలోనూ ఇలాంటి కేసు జరిగిందని, వాళ్లే ఈ చోరీ చేశారనే కోణంలో దర్యాప్తు చేస్తున్నామన్నారు. సీసీ పుటేజీలను క్షుణ్ణంగా పరిశీలిస్తున్నామని, దొంగలను అతి త్వరలో పట్టుకుంటామని తెలిపారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

సీనియారిటీ ప్రకారం బదిలీలు కల్పించాలి

రామాయంపేట, జూన్ 30: సీనియారిటీ ప్రకారం ఉపాధ్యాయ బదిలీలు చేపట్టాలని టీఆర్‌టీఎఫ్ జిల్లా అధ్యక్షుడు మెంగర్తి ప్రణీద్ కుమార్ అన్నారు. ఆదివారం రామాయంపేటలో టీఆర్‌టీఎఫ్ సమావేశం ఏర్పాటు చేశారు. ప్రభుత్వం చేపడుతున్న బదిలీలు పారదర్శకంగా ఉండాలన్నారు. సీనియర్లకు ముందటి వరుసలో బదిలీలు చేపట్టాలన్నారు. ఈ బదిలీల్లో ఎస్‌జీటీలకు తీవ్ర నష్టం వాటిల్లుతున్నదన్నారు. సమావేశంలో రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఐరేని రవీందర్‌గౌడ్, ప్రధాన కార్యదర్శి ఐలయ్య, మండల అధ్యక్షుడు ఇంద్రసేనాచారి, ఎం.శేఖర్, నిజాంపేట మండల శాఖ అధ్యక్షుడు నవీన్ రత్నాకర్ పాల్గొన్నారు.

బాధితులకు సెల్‌ఫోన్లు అప్పగింత

నిజాంపేట, జూన్ 30: వివిధ ప్రదేశాల్లో సెల్‌ఫోన్లు పోగొట్టుకున్న బాధితులకు నిజాంపేట పోలీసులు ఆదివారం అప్పగించారు. ఎస్సై శ్రీనివాస్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. నిజాంపేటకు చెందిన స్వామి, బాబు, కల్వకుంటకు చెందిన హరిదాస్, చల్మెడకు చెందిన మస్తాన్‌బాబు, అశోక్‌గౌడ్, సిరిసిల్లకు చెందిన రాజయ్య పోగొట్టుకున్న సెల్‌ఫోన్లను సీఈఐఆర్ వెబ్‌సైట్ ద్వారా వెతికి బాధితులకు అప్పగించారు.

చాముండేశ్వరీ ఆలయంలో ప్రత్యేక పూజలు

చాముండేశ్వరీ అమ్మవారు

చిలిపిచెడ్, జూన్ 30: మండలంలోని చిట్కుల్ గ్రామ శివారులోని వెలిసిన చాముండేశ్వరీ ఆలయంలో భక్తులు ఆదివారం ప్రత్యేక పూజలు చేశారు. ఆలయం సమీపంలోని మంజీరా నదిలో పుణ్యస్నానాలు ఆచరించి అమ్మవారికి కుంకుమార్చనలు, ఒడిబియ్యం సమర్పించారు. ఆలయ ప్రధాన పూజరి ప్రభాకరశర్మ అమ్మవారికి ప్రత్యేక అలంకరణ చేసి పూజలు చేసి, తీర్థప్రసాదాలు అందజేశారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అన్నదానం చేశారు.

భెల్ చౌరస్తాలో గంజాయి పట్టివేత

రామచంద్రాపురం, జూన్ 30: ఆటోలో గంజాయిని తరలిస్తున్న ఇద్దరు వ్యక్తులను ఆర్సీపురం పోలీసులు ఆదివారం అదుపులోకి తీసుకున్నారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఆర్సీపురం పోలీస్‌స్టేషన్ సమీపంలోని భెల్ చౌరస్తాలో వాహనాల తనిఖీ చేస్తున్న క్రమంలో ఆసీఫ్‌నగర్‌కు చెందిన ఎండీ ఇస్మాయిల్, మహమ్మద్ ఖాసీమ్ ఇద్దరు స్నేహితులు ఆటోలో గంజాయి తీసుకొని పటాన్‌చెరు వైపునకు వెళ్తున్నారు. పోలీసుల కు అనుమానం వచ్చి ఆటోని తనిఖీ చేయగా 30కేజీల గంజాయి దొరికింది. దీంతో వారిద్దరిని అదుపులోకి తీసుకొని విచారించారు. సికింద్రాబాద్‌కు చెందిన గణపతి అనే వ్యక్తి ఒడిశా నుంచి గంజాయి తెచ్చాడని, అతని వద్ద నుంచి తీసుకొని పటాన్‌చెరుకి వెళ్తున్నట్లు ఇస్మాయిల్, ఖాసీమ్ పోలీసులకు తెలిపారు. ఈ మేరకు ఆ ఇద్దరిపై ఇన్‌స్పెక్టర్ జగన్నాథ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలి

కోహీర్, జూన్ 30: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంబిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలను నిరసిస్తూ ఈ నెల 10న నిర్వహించే 'కార్మికుల డిమాండ్స్ డే'ను జయప్రదం చేయాలని సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి మహిపాల్ కోరారు. ఆదివారం జహీరాబాద్‌లో మున్సిపల్ కార్మికులతో సీఐటీయూ ఆధ్వర్యంలో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కార్మికులకు రూ.26వేల వేతనం, కార్మిక చట్టాలను రద్దు చేయాలని 10వ తేదీన నిర్వహించే డిమాండ్స్ డేలో కార్మికులందరూ పాల్గొనాలని కోరారు. మండల కేంద్రాలు, పట్టణాల్లో డిమాండ్స్ డేను నిర్వహించాలన్నారు. ప్రధాన కార్యదర్శి ఎల్లప్ప, నాయకులు మొగులయ్య, గుండప్ప, శ్రీనివాస్ పాల్గొన్నారు.

మన్‌కీ బాత్‌ను వీక్షించిన బీజేపీ నాయకులు



నర్సాపూర్,జూన్30: ప్రధాని మోదీ మన్‌కీ బాత్‌ను నర్సాపూర్‌లో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు మురళీధర్ యాదవ్, నాయకులు ఆదివారం టీవీలో వీక్షించారు. అసెంబ్లీ కన్వీనర్ రమణారావు, ఓబీసీ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడు చిన్న రమేశ్‌గౌడ్, ఓబీసీ మోర్చా రాష్ట్ర అధికార ప్రతినిధి పెద్ద రమేశ్‌గౌడ్, జిల్లా ప్రధాన కార్యదర్శి గోడ రాజేందర్, కౌన్సిలర్ సురేశ్, లతారమేశ్‌యాదవ్, పట్టణ ప్రధాన కార్యదర్శి బాలరాజు, రామిరెడ్డి పాల్గొన్నారు.

3నరాష్ట్ర కిడ్స్ జూనియర్ అథ్లెటిక్స్ జిల్లాస్థాయి ఎంపికలు

మెదక్ మున్సిపాలిటీ, జూన్ 30: రాష్ట్ర కిడ్స్ జూనియర్ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్-24 జిల్లాస్థాయి ఎంపికలున్నట్లు జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు వెంకట రమణ, మధుసూదన్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా కేంద్రంలోని ఇందిరాగాంధీ స్టేడియంలో అండర్ 8, 10, 12 విభాగాల్లో బాలబాలికలకు అథ్లెటిక్స్ పోటీల్లో ఈనెల 3వ తేదీన ఈ ఎంపికలు ఉంటాయని పేర్కొన్నారు. ఎంపికలకు క్రీడాకారులు వయస్సు ధ్రువీకరణ పత్రాలను వెంట తీసుకుని రావాలని తెలిపారు. జిల్లాస్థాయిలో ఉత్తమ ప్రతిభ కనబర్చిన క్రీడాకారులకు ఈనెల 7న హైదరాబాద్‌లోని గచ్చిబౌలిలో గల గోపీచంద్ అకాడమీలో రాష్ట్ర స్థాయి పోటీలు నిర్వహిస్తామన్నారు. వివరాలకు 9963005540 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

జిల్లాలో పోలీస్ యాక్ట్ అమలు

మెదక్ అర్బన్, జూన్ 30: జిల్లాలో శాంతి భద్రతలను దృష్టిలో ఉంచుకుని 1 నుంచి 31వ తేదీ వరకు జిల్లా వ్యాప్తంగా 30, 30(ఎ) పోలీస్ యాక్ట్ అమలులో ఉంటుందని ఎస్పీ బాలస్వామి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. పోలీసుల అధికారుల అనుమతి లేకుండా జిల్లాలో ధర్నాలు, రాస్తారోకోలు, నిరసనలు, ర్యాలీలు, పబ్లిక్ మీటింగ్‌లు, సభలు, సమావేశాలు నిర్వహించరాదన్నారు. ప్రజాధనాన్ని నష్టం కల్గించే చట్ట వ్యతిరేక కార్యక్రమాలు చేపట్టరాదన్నారు.

నిజాం షుగర్ ఫ్యాక్టరీని పునరుద్ధరించాలి

మెదక్, జూన్ 30 (నమస్తే తెలంగాణ): ఎన్నికల మ్యానిఫెస్టోలో నిజాం షుగర్ ఫ్యాక్టరీని పునరుద్ధరించాలని కాంగ్రెస్ పొందుపర్చిన విషయాన్ని మెదక్ మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ నాయకుడు పట్లోళ్ల శశిధర్‌రెడ్డి, సీఎం రేవంత్‌రెడ్డికి బహిరంగ లేఖ రాశారు. మెదక్ రైతులకు అవసరమయ్యే మెదక్-మంబోజిపల్లి నిజాం షుగర్స్ ఫ్యాక్టరీతో 14 మండలాల ప్రజలకు ప్రయోజనం చేకూరుతుందని తెలిపారు. గతంలో లక్షల టన్నుల చెరుకును ఈ ఫ్యాక్టరీకి తరలించేవారని గుర్తుచేశారు. వెంటనే నిధులు మంజూరు చేసి ఫ్యాక్టరీని పునరుద్ధరించాలని కోరారు.

మురుగు నీటితో ఇబ్బందులు

ముఖద్వారం వద్దనిలిచిన మురుగునీరు

నర్సాపూర్, జూన్ 30: మండలంలోని లింగాపూర్ గ్రామ ముఖద్వారం వద్ద రోడ్డుపై మురుగు నీరు నిలిచి స్థానికులు ఇబ్బందులు పడుతున్నారు. మురుగు నీరు దుర్గంధం వెదజల్లడం, ఈగలు, దోమలు స్వైర్థవిహారం చేయడంతో అనారోగ్యానికి గురవుతున్నారని గ్రామస్తులు భయపడుతున్నారు. మురుగు నీటిని తొలిగించాలని అధికారులను కోరుతున్నారు.

3న కలెక్టరేట్ ఎదుట నిరసన

మెదక్ మున్సిపాలిటీ, జూన్ 30: నీట్, సెట్, నెట్ లాంటి కేంద్రీకృత పరీక్షలు రద్దు చేసి వాటి నిర్వహణను రాష్ట్ర ప్రభుత్వాలకు అప్పగించాలంటూ రాష్ట్ర విద్యా పరిరక్షణ కమిటీ ఆధ్వర్యంలో ఈనెల 3న కలెక్టరేట్ ఎదుట నిరసన ప్రదర్శన చేపట్టనున్నట్లు టీపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు సంగయ్య ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. నూతన జాతీయ విద్యా విధానాన్ని రాష్ట్ర ప్రభుత్వం తిరస్కరించి, రాష్ట్ర అవసరాలకు ఒక విద్యా విధానం తయారు చేయాలని డిమాండ్ చేశారు.

ద్విచక్రవాహనం అదుపు తప్పి ఒకరికి తీవ్రగాయలు

నిజాంపేట, జూన్ 30: రోడ్డు ప్రమాదంలో ఒకరికి తీవ్ర గాయలైన ఘటన నందిగామ గ్రామ శివారులో ఆదివారం జరిగింది. రాయిలాపూర్ గ్రామానికి చెందిన చంద్రం నందిగామ గ్రామానికి వెళ్తున్న క్రమంలో ద్విచక్ర వాహనం అదుపుతప్పి కింద పడి తీవ్ర గాయాలయ్యాయి. ఇది గమనించిన స్థానికులు చికిత్స నిమిత్తం చంద్రాన్ని గాంధీ దవాఖానకు తరలించారు.

ఆలయ వార్షికోత్సవ వేడుకలు

చేగుంట,జూన్30: చేగుంట మండలం కిష్టాపూర్‌లో గోపాలస్వామి దేవాలయ ప్రథమ వార్షికోత్సవాన్ని నిర్వహిస్తున్నారు. ఈ వేడుకల్లో చేగుంట మండలం కిష్టాపూర్‌లో జరుగుతున్న వేణుగోపాలస్వామి దేవాలయ ప్రథమవార్షికోత్సవాల్లో దుబ్బాక నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి చెరుకు శ్రీనివాస్‌రెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు వడ్ల నవీన్‌కుమార్ పాల్గొన్నారు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్
PLOT FOR SALE
★గజ్వేల్ టౌన్ మెయిన్ రోడ్, SBI దగ్గర 161 చ.గ. ఇంటి స్థలం అమ్మబడును. వివరాలకు సంప్ర: 8143366630 / 9989554915.
NT-325858
గమనిక: క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు స